గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్, పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, చిత్రంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, సమన్వయకర్త ఆడారి ఆనంద్



హాజరైన పార్టీ ముఖ్యనాయకులు, కార్యకర్తలు

- సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు సమన్వయంతో ముందుకు వెళ్లాలి
- పశ్చిమ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి

సాక్షి, విశాఖపట్నం: వచ్చే ఎన్నికల్లో విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జయకేతనానికి అందరూ కృషి చేయాలని టీటీడీ చైర్మన్, పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు సమన్వయంతో ప్రతీ ఇంటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. మంగళవారం మద్దిలపాలెం పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్ బాబు ఆధ్వర్యంలో విశాఖ పశ్చిమ నియోజకవర్గ పార్టీ ముఖ్యనాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ప్రతీ వార్డులోని ముఖ్యనాయకులు, వార్డు అధ్యక్షులు, కార్పొరేటర్లతో విడివిడిగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఎన్నికలకు ముందుకు ఇచ్చిన హామీలను మూడున్నరేళ్లలోనే అమలుచేశామని, ఈ విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. పేద విద్యార్థుల కోసం జగనన్న విద్యా దీవెన, విదేశీ విద్యాదీవెన, వసతి దీవెన, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలను అమలుచేసిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో విశాఖ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్, నియోజకవర్గ పరిశీలకుడు ఎస్.ఎ.రెహమాన్, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లా కృష్ణ, ముఖ్యనాయకులు రవిరెడ్డి,కలిదిండి బద్రీనాథ్, బాకి శ్యాంకుమార్‌రెడ్డి, శ్రీదేవివర్మ, కార్పొరేటర్లు గుండపు నాగేశ్వరరావు, ముర్రువాణి, గులిగుండల లావణ్య, పి.వి.సురేష్, కొణతాల సుధ, బల్లా లక్ష్మణరావు, కుంచె జ్యోత్స్న, వార్డు అధ్యక్షులు ఆడారి శ్రీనివాస్, పిలక రామ్మోహన్‌రెడ్డి, దొడ్డి కిరణ్, చుక్క ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరికలు



పార్టీలోకి అప్పలరాజును ఆహ్వానిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు ప్రాంతానికి చెందిన యువజన నాయీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చల్లపల్లి అప్పలరాజుతో పాటు పలువురు వైఎస్సార్‌సీపీలో చేరారు.మల్కాపురంలోమంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన పార్టీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆడారి ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సేవలను గుర్తించి పలువురు పార్టీలో చేరుతున్నారన్నారు.

విడాకులు ఇవ్వకుంటే అడ్డు తొలగించుకుంటా..

వివాహేతర సంబంధం పెట్టుకొని బెదిరిస్తున్నాడని భర్తపై భార్య ఫిర్యాదు

దొండపర్తి(విశాఖ దక్షిణ): మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకొని విడాకులు ఇవ్వకపోతే అడ్డు తొలగించుకుంటానని బెదిరిస్తున్నాడని భర్తపై భార్య నగర పోలీస్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్‌కు ఫిర్యాదు చేసింది. భర్త గండేటి సుదర్శన్‌తో పాటు వివాహేతర సంబంధం సాగిస్తున్న మహిళ కూడా తననే కాకుండా తన పిల్లలను కూడా తీవ్ర దుర్భాషలాడుతూ బెదిరింపులకు పాల్పడిందని ఫిర్యాదులో పేర్కొంది. తనకు న్యాయం చేయాలని సీపీని కోరగా ఆయన విచారణ నిమిత్తం దిశ పోలీసులకు కేసును అప్పగించారు. ఆమె ఫిర్యాదు ప్రకారం.. పాత జైల్ రోడ్డు ప్రాంతానికి చెందిన గండేటి సుదర్శన్‌రావుకు, ఎస్‌ఏడీ కొత్త రోడ్డుకు చెందిన గండేటి అన్నాకుమారిలకు 2003లో రిజిస్టర్ వివాహం జరిగింది. వీరికి ఒక బాబు, పాప ఉన్నారు. 2007లో సుదర్శన్‌కు కువైట్‌లో ఉద్యోగం రావడంతో వెళ్లిపోయాడు. మధ్యలో వచ్చి రెండు, మూడు నెలలు ఉండి వెళ్లేవాడు. 2020 మార్చిలో అక్కడి నుంచి తిరిగి విశాఖకు వచ్చేశాడు. కొద్ది రోజుల తరువాత సుదర్శన్.. వేరే మహిళతో తరచూ అర్ధరాత్రుళ్లు కూడా మాట్లాడుతుండడాన్ని భార్య అన్నాకుమారి గమనించింది. దీనిపై భర్తను ప్రశ్నించగా.. ఓ మహిళకు ఒక పోలీస్ కేసు విషయంలో సహాయం చేస్తున్నానని చెప్పేవాడు. అయితే భార్యకు అనుమానం వచ్చి అతని వాట్సాప్ చాట్ చూడగా.. అందులో అసభ్యకరమైన మెసేజ్‌లు కనిపించాయి. వాటిపై ప్రశ్నించగా ఆమెను దాబాయించేసి మాట దాటించేవాడు. ఫోన్లు, చాటింగ్‌లు మాత్రమే కాకుండా మద్దిలపాలెంలో ఉంటున్న మహిళ ఇంటికి వెళ్లి అక్కడే ఉండడం ప్రారంభించాడు. రాత్రుళ్లు కూడా ఇంటికి రాకపోగా.. భార్య అన్నాకుమారికి ఫోన్ చేసి తమ బంధానికి అడ్డుగా ఉన్నావని, విడాకులు ఇవ్వాలని, లేకపోతే నిన్ను ఎలా తప్పించాలో తెలుసని భార్యను బెదిరించాడు. నెల రోజుల నుంచి ఈ వేధింపులు మరింత ఎక్కువయ్యాగా, శారీరకంగా, మానసికంగా హింస్తున్నాడని, తన భర్త, వివాహేతర సంబంధం సాగిస్తున్న మహిళ నుంచి తనకు, తన పిల్లలకు ప్రాణ హాని ఉందని భార్య అన్నాకుమారి పోలీసులకు ఫిర్యాదు చేసింది. తమకు న్యాయం చేయాలని కోరింది. ఈ ఫిర్యాదుపై దిశ పోలీసులు దర్యాప్తు చేశారు. ఇరువురికి కౌన్సెలింగ్ ఇచ్చారు.

క్లుప్తంగా

'రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి'



టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డికి వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్ లావణ్య

మల్కాపురం: ఆర్థికంగా వెనుకబడిన రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని 58వ వార్డు కార్పొరేటర్ గులిగిండల లావణ్య కోరారు. ఈ మేరకు పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు నగరానికి వచ్చిన టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి ఆమె మంగళవారం వినతి పత్రం అందజేశారు. నిరుపేదలైన రజకులను ఎస్సీ జాబితాలో చేర్చితే వారికి ఎంతో మేలు చేకూరుతోందన్నారు. ఈ సమస్యను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగేలా సహకరించాలని కోరారు. దీనిపై వైవీ సుబ్బారెడ్డి సానుకూలంగా స్పందించారని కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

52వ వార్డులో బీజేపీ ప్రచారం

గోపాలపట్నం: జీవీఎంసీ 52వ వార్డు కరాసాలో బీజేపీ నాయకులు పట్టభద్రుల ఓటర్ల ఇళ్లకు తమ పార్టీ బలపర్చిన అభ్యర్థి పీవీఎన్ మాధవ్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ పశ్చిమ కోఆర్డినేటర్ దాడి పురుషోత్తమ రమేష్ , జిల్లా కార్యదర్శి సీహెచ్ మంజుల, చంద్రశేఖర్, స్థానిక కార్యకర్తలు పాల్గొన్నారు.

పూడికలు తొలగించరూ..!



రోడ్డు పక్కన వ్యర్థాలు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం మరిడిమాంబ ఆలయానికి వెనుక మార్గానికి ఆనుకుని ఉన్న పెద్ద కాలువలో వ్యర్థాలను 15 రోజుల కిందట ఆ ప్రాంత శానిటరీ సిబ్బంది తొలగించారు. ఇలా తొలగించిన వాటిని వ్యాన్ సాయంతో డంపింగ్ యార్డ్‌కు తరలించాలి. కానీ 15 రోజులు గడుస్తున్నా రోడ్డుపైనే వదిలేశారు. దీంతో అక్కడ వీధి కుక్కలు,పందులు చేరి తిరిగి ఆ వ్యర్థాలను కాలువలోకి తోసేస్తున్నాయి. సమస్యపై అధికారులు స్పందించి వ్యర్థాలను తరలించాలని స్థానిక వాసులు కోరుతున్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

కూర్మన్నపాలెం: దువ్వాడ మంగళపాలెం ప్రాంతానికి చెందిన సంపంగి త్రినాథ్ (46) ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. మంగళపాలెం ప్రాంతంలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం బ్లాక్ నెంబర్ 63లోని ఎఫ్ఎఫ్-4లో ఉంటున్న సంపంగి త్రినాథ్ రియల్ ఎస్టేట్ వ్యాపారి. కుటుంబ కలహాల నేపథ్యంలో భార్యపిల్లలు దూరంగా ఉంటున్నారు. దీంతో మనస్తాపంతో త్రినాథ్ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. అయితే, ఆయన ఒంటరిగా ఉండడంతో మృతి చెందిన విషయం ఎవరికీ తెలియలేదు. మంగళవారం సాయంత్రం వారు నివసిస్తున్న బ్లాక్‌లో నీరు ఎక్కడం లేదని పైన ట్యాంక్ చూసేందుకు సుమారు 5గంటల సమయంలో పైకి వెళ్లిన స్థానికులకు త్రినాథ్ కిటికీ హుక్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. వెంటనే వారు 100కి డయల్ చేసి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి సోదరుడు రాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

నాయీబ్రాహ్మణులకు అండగా ప్రభుత్వం

- వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి
- కుల వృత్తి పని ముట్ల పంపిణీ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్, బద్రీనాథ్, సంఘ ప్రతినిధులు

మల్కాపురం: నాయీ బ్రాహ్మణులకు తమ ప్రభుత్వం అండగా నిలుస్తుందని, వారి సంక్షేమానికి ఇప్పటికే పలు పథకాలు అమలు చేసి ఆదుకుంటున్నామని వైఎస్సార్‌సీపీ పశ్చిమనియోజకవర్గ సమన్వకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. స్థానిక యువజన నాయీ బ్రాహ్మణ సేవా సంఘం రూపొందించిన క్యాలెండర్‌ను మంగళవారం మల్కాపురం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆనంద్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెలూన్ షాపులకు నెలకు 150 యూనిట్ల లోపు వరకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. అలాగే జగనన్న చేదోడు కార్యక్రమం ద్వారా ఏటా రూ 10. వేలు జగన్ ప్రభుత్వం అందిస్తుందన్నారు. పారిశ్రామిక ప్రాంతంలో నాయీ బ్రాహ్మణుల సామాజిక భవనం ఏర్పాటుకు తన వంతు సహకారం అందిస్తానని ఆనంద్‌కుమార్ హామీ ఇచ్చారు. వైఎస్సార్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్ మాట్లాడుతూ కుల వృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న నాయీ బ్రాహ్మణులకు వైఎస్సార్‌సీపీ తోనే న్యాయం జరుగుతుందన్నారు. నాయీ బ్రాహ్మణ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చల్లపల్లి అప్పలరాజు మాట్లాడుతూ తమ వర్గ ప్రజలను గతంలో ఏ ప్రభుత్వం ఆదుకోలేదన్నారు. జగనన్న ప్రభు త్వం మాత్రమే తమ ఆర్థిక ఇబ్బందులను గుర్తించి సాయం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పి.వి.సురేష్, కొణతాల సుధ,బల్లా లక్ష్మణరావు,గుండపు నాగేశ్వరరావు, నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ప్రతినిధులు తుమ్మిడి రామకుమార్,ఆరిపాక పెంటరావు,వెంపడాపు నూకరాజు,యలమంచిలి ఈశ్వరరావు,కింజంగి శ్రీనివాసరావు తదితరు లు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా నాయీ బ్రాహ్మణులకు ఆడారి ఆనంద్‌కుమార్ తన సొంత నిధులతో కుల వృత్తి కిట్లను సుమారు వంద మందికి పంపిణీ చేశారు.

పబ్లిక్ డిమాండ్

వెలగని వీధిలైట్లు



విద్యుత్ ఎల్ఈడీ లైట్ పని చేయని స్తంభం

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం సర్వీసురోడ్డులోని విద్యుత్ ఎల్ఈడీ లైటు వారం నుంచి వెలగడం లేదు. దీంతో ఇక్కడ ఫుట్‌పాత్‌పై రాకపోకలు సాగించే వారు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

తడి-పొడి చెత్తపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జోనల్ కమిషనర్ కృష్ణ

కంచరపాలెం: స్థానిక కంచరపాలెం రామ్మూర్తిపంతులుపేట ఉన్నత పాఠశాలలో జోన్-5 పబ్లిక్‌హెల్త్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం తడి-పొడి చెత్త, ప్రమాదకర ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జోనల్ కమిషనర్ ఆర్ వీజీ కృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి రోజు తడి-పొడి చెత్తను వేరు చేసి పారిశుధ్య సిబ్బందికి అందించాలని, ప్రమాదకర ప్లాస్టిక్‌ను వినియోగించకూడదని తెలిపారు. పాఠశాల తరగతి గదులు, పరిసరాలు, టాయిలెట్లు శుభ్రంగా ఉండేలా చూడాలని పాఠశాల ఆయాలు, ఉపాధ్యాయులను ఆయన కోరారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేలా పరిసరాల్లో మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో డాక్టర్ రాజేష్, కార్పొరేటర్ రాజశేఖర్, పాఠశాల హెచ్ఎం ఆర్. శ్రీనివాసరావు, పబ్లిక్ హెల్త్ సూపర్‌వైజర్ జనార్దన్, సచివాలయ శానిటరీ సెక్రటరీ నళిని, అడ్మిన్ అశోక్, ఉపాధ్యాయులు, పారిశుధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఈ మరుగు దొడ్లకు మోక్షం లేదా!

- నెలలు గడుస్తున్నా మరమ్మతులు చేపట్టని వైనం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



శిథిలమైన బేసిన్



బుచ్చిరాజుపాలెంలోని జీవీఎంసీ ప్రజా మరుగుదొడ్లు

గోపాలపట్నం: స్వచ్ఛత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లక్షల కోట్లు వెచ్చిస్తున్నాయి. అయితే అధికారుల నిర్లక్ష్యంతో ఆ లక్ష్యాలు నిర్వీర్యమవుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా సర్వే చేపట్టడానికి వస్తున్నారని తెలియగానే అధికారులు హడావుడి చేసి రంగులు వేసి చిన్నచిన్న మరమ్మతులు చేశారు. సర్వే పూర్తయిన తర్వాత వాటి గురించి పట్టించుకోవడం మానేశారు. ఇది బుచ్చిరాజుపాలెం ఏపీఎస్ఈబీ కాలనీలోని జీవీఎంసీ మరుగుదొడ్ల పరిస్థితి. ఇవి బాగు పడాలంటే మళ్లీ స్వచ్ఛ సర్వేక్షణ్ నిధులు రావాలని అధికారులు చెప్పడం దారుణమని స్థానికులు వాపోతున్నారు.

నాణ్యతా లోపమే కారణం...

గతేడాది స్వచ్ఛ సర్వేక్షణ్ పనుల్లో భాగంగా ఈ మరుగు దొడ్లు మరమ్మతులు చేపట్టారు. అయితే పనుల్లో నాణ్యతా లోపాలు కారణంగా పూర్తిగా శిథిలమైపోయాయి. మరుగుదొడ్లలో ఏర్పాటు చేసిన బేసిన్లు కూడా కుంగిపోయి విరిగి పోయాయి. పైప్ లైన్లు పాడవడంతో మరుగు వెళ్లే పరిస్థితి లేకపోయింది. దీనిపై పలు మార్లు అధికారులు దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయిందని వాపోతున్నారు.

ఇబ్బందులు పడుతున్న స్థానికులు

ఇక్కడి సులభ్ కాంప్లెక్స్ పక్కనే ఉన్న సాఫ్ట్‌వేర్ సంస్థలో తరుచూ పరీక్షలు జరుగుతుంటాయి. ఇందు కోసం చాలా మంది ఇతర ప్రాంతాల నుంచి వస్తుంటారు. ఈ సులభ్ కాంప్లెక్స్ వీరికి ఎంతగానో ఉపయోగపడేది. దగ్గర్లో ఉన్న వారు చాలా మంది వీటినే వాడుతుంటారు. వీరంతా ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని వెంటనే బాగు చేయాలని కోరుతున్నారు.

జేఈఈ మెయిన్స్‌లో విశాఖ సత్తా

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో విశాఖ విద్యార్థులు సత్తా చాటారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మంచి పర్సంటైల్ సాధించారు. విశాఖ ఖ్యాతిని చాటి చెప్పారు. ఈ సందర్భంగా ఆయా కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను అభినందించాయి.

నారాయణ ప్రభంజనం

సీతమ్మధార: జేఈఈ మెయిన్-2023 ఫలితాల్లో నారాయణ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని సంస్థ డీజీఎం హనుమంతరావు, డీన్ జి.రామలింగేశ్వరరావు తెలిపారు. తమ సంస్థ విద్యార్థులు పి.తేజశ్రీ 99.986295, ఎంవీవీ హర్షవర్ధన్ 99.9856388, ఎల్.అనన్య 99.9642468, సీహెచ్ వెంకట యశ్వంత్ 99.9409876, పి.బాలాజీ అభిషేక్ 99.9339384, ఎం.అనుశ్రీ 99.9248252, వి.యశస్వినాయుడు 99.9244526, ఎం.సుభాసివర్మ 99.9231306, ఎస్.మౌనిషా నాయుడు 99.9071369, పి.సాత్విక 99.9054354 పర్సంటైల్ సాధించినట్టు చెప్పారు. ఈ ఫలితాల్లో 56 మంది విద్యార్థులు 99 పర్సంటైల్ కంటే అధికంగా సాధించారని వెల్లడించారు. విద్యార్థులు, అధ్యాపకులను డీజీఎం, డీన్ అభినందించారు.

ఫలితాల్లో తిరుగులేని శశి

తగరపువలస: సంగివలస శశి విద్యార్థులు జేఈఈ మెయిన్ ఫలితాల్లో అత్యధిక పర్సంటైల్ సాధించినట్టు ఆ విద్యా సంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ తెలిపారు. కె.అభిరామ్ 99.89, బి.కావ్య 99.84, పి.సాయిరాం 99.75, ఆర్.సాయినారాయణ 99.61, ఎం.నాగదుర్గా సతీష్ 99.57, కె.సాయికృష్ణ రమేష్ 99.33, డి.వి.వి చైతన్య 99.28, వి.శ్రీసూర్య గుణ్వంత్ 99.14, ఎ.రంజిత్‌కుమార్ 99.14, ఇ.గౌతం ధీరజ్ 99.01 పర్సంటైల్ సాధించారన్నారు. అలాగే 99 పైన 10 మంది, 98 పైన 20 మంది, 97 పైన 33, 96 పైన 41, 95 పైన 48 మంది పర్సంటైల్ సాధించినట్లు చెప్పారు. ప్రతిభ చూపిన విద్యార్థులను వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ, డైరెక్టర్ మేకా క్రాంతి సుధ అభినందించారు.

శ్రీ చైతన్య హవా

విశాఖ విద్య: జేఈఈ మెయిన్ ఫలితాల్లో విశాఖ శ్రీ చైతన్య ఐఐటీ అకడామీ విద్యార్థులు సత్తా చాటారు. ఎం.ప్రశాంతి శ్రీజ, ఎస్.అనిరుధ్, ఎస్.సిద్ధార్థ, రహమాన్ షేక్ జమీల్, డి.సాకేత్ నాయుడు, కె.శ్రీ కార్తిక్, జి.హరిచరిణి, ఆర్. మోహిత్ నాయుడు 99 పైగా పర్సంటైల్ ఎగ్జిక్యూటివ్ ఏజీఎం కె.వి.రమణ తెలిపారు. విద్యార్థులను సంస్థ డీన్లు ఎస్.రఘుకుమార్, కె.బంగారు బాబు, జె.సత్యనారాయణ, పి. సత్యనారాయణ అభినందించారు. అధ్యాపక, అధ్యాపకేతర బృందాన్ని అభినందించారు.

శ్రీవిశ్వ విజయకేతనం

సీతంపేట: జేఈఈ మెయిన్-2023 ఫలితాల్లో శ్రీ విశ్వ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యధిక పర్సంటైల్ సాధించారు. సీహెచ్.ప్రతీష్ 99.61 పర్సంటైల్, బి.తనూజ 99.33, ఎ.మహర్షి 99.27, బి.కార్తీక్ శశాంక్ 99.25, ఎల్.హేమంత్ 99.25 పర్సంటైల్ సాధించారు. ఐదుగురు విద్యార్థులు 99 పర్సంటైల్ పైగా, 18 మంది విద్యార్థులు 98 పర్సంటైల్ పైగా సాధించినట్లు శ్రీ విశ్వ విద్యా సంస్థల కె.ధర్మరాజు, డైరెక్టర్ పి.సూర్యనారాయణ తెలిపారు. విద్యార్థులను అభినందించారు.

ఫిట్జీ విద్యార్థుల ప్రతిభ

సీతంపేట: జేఈఈ మెయిన్ ఫలితాల్లో ఫిట్జీ వైజాగ్ సెంటర్ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారు. షేక్ ఆవేజ్ మెహతాబ్ 99.96, నితిల్ కవిన్ 99.96, పీలా రత్న హర్ష 99.93, ఆయుష్ మార్తాండ్ బోర్కర్ 99.88, పెండెల హర్షిత్ 99.85, యు.ఎల్.ఎస్.ఎస్.వైభవ్ 99.85, రూపేష్ మల్లిరెడ్డి 99.82, ఆనంద్ సిద్ధార్థ్ 99.32 పర్సంటైల్ సాధించారని సెంటర్ హెడ్ పెండేల మస్తాన్‌రావు తెలిపారు. ఫిట్జీ వైజాగ్ సెంటర్ నుంచి 462 మంది హాజరు కాగా 22 మంది విద్యార్థులు 99 కంటే ఎక్కువ, 106 మంది 95 కంటే ఎక్కువ, 174 మంది 90 కంటే ఎక్కువ పర్సంటైల్ సాధించినట్లు వెల్లడించారు.

ప్రైవేటీకరణ ఆపేవరకు ఉద్యమం

- స్పష్టం చేసిన ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు
- 726వ రోజుకు రిలే దీక్షలు



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకుడు రామకృష్ణ

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపేవరకు కార్మికుల ఉద్యమాలు ఆగవని పోరాట కమిటీ నాయకులు అన్నారు. కేంద్రప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకుని, పార్లమెంట్‌లో ప్రకటించేవరకు దీక్షలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహారదీక్షల్లో 726వ రోజు మంగళవారం బ్లాస్ట్‌ఫర్నేస్ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దీక్షలో కూర్చున్న కార్మికులను ఉద్దేశించి పోరాట కమిటీ నాయకులు జె.రామకృష్ణ, యు.రామస్వామి మాట్లాడారు. ప్లాంట్‌ను అభివృద్ధి పథంలో నడిపేందుకు గత 30 ఏళ్లుగా కార్మికులు ఎంతగానో శ్రమించారన్నారు. నిర్వాసితుల త్యాగాన్ని, కార్మికుల కష్టాన్ని పట్టించుకోకుండా ప్రభుత్వరంగ పరిశ్రమలను అమ్మాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణను విరమించే వరకు వినూత్న రీతిలో పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు ఐక్యంగా పోరాడాలని కోరారు. కార్యక్రమంలో సాయిరాం, రవికిరణ్, ఈశ్వరరావు, మధు, వెంకటరావు, నగేష్, నల్ల రవి, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

వేతన సవరణ జాప్యం చేస్తే ఆందోళన ఉధృతం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు వేతన సవరణ చేయడంలో జాప్యం చేస్తే ఆందోళన ఉధృతం చేస్తామని స్టీల్ ఏఐటీయూసీ నాయకులు అన్నారు. ఉక్కు అడ్మిన్ వద్ద మంగళవారం చేపట్టిన దీక్ష శిబిరంలో వారు మాట్లాడారు. మొత్తం కార్మిక వర్గం కోసం ఎన్‌జేసీఎస్‌లో అనేక సార్లు చర్చలు జరిగి, చివరకు ఒప్పందం జరిగిందన్నారు. ఒప్పందం మేరకు సెయిల్‌లో అమలు చేసినా స్టీల్‌ప్లాంట్‌లో అమలు చేయక పోవడం అన్యాయమన్నారు. వేతన సవరణలో జాప్యం వల్ల కార్మికుల్లో అశాంతి పెరుగుతోందని, ఇప్పటికైనా యాజమాన్యం పెంచిన వేతనాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సిరుల తల్లికి స్వర్ణ పుష్పార్చన

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి అమ్మవారికి మంగళ వారం స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8గంటల వరకు జరిపించిన అష్టదళ పద్మారాధనలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.

కనక మహాలక్ష్మికి లక్ష కుంకుమార్చన

నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం లక్ష కుంకుమార్చన ప్రత్యేక పూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు నిర్వహించిన ప్రత్యేక పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమాల్లో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష, ట్రస్ట్ బోర్డ్ చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు సహస్ర తులసి పూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 9న గురువారం సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే దంపతులు రూ.1500 పూజా రుసుం చెల్లించి, పాల్గొనవచ్చని పేర్కొన్నారు.